సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



పదోన్నతులకు లైన్ క్లియర్..

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులకు ప్రభుత్వం నుంచి లైన్‌క్లియర్ అయ్యింది. దీంతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

- 8లో▸



పురాతన ఆలయాలకు పూర్వవైభవం

కాకతీయుల కాలం నాటి దేవాలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం $31^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యూఆర్ఎస్ తనిఖీ



విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్ బజార్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను (యూఆర్ఎస్) గురువారం డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తనిఖీ చేశారు. హాస్టల్ నిర్వహణ, తరగతి గదులు, వంటగదిని పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ఆయనవెంట డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీ, లేబర్ ఆఫీసర్ చాణక్య, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజింగ్ కో–ఆర్డినేటర్ బి.రాధ ఉన్నారు.

ఇంటర్వ్యూలు

యూఆర్ఎస్‌లో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ నియామకాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆరుగురు అభ్యర్థులు హాజరుకాగా, ఇద్దరిని ఎంపిక చేశారు.

పాఠ్యపుస్తకాల్లో దోషాల సవరణకు సూచనలివ్వాలి: డీఈఓ

మూడు, ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకాల్లో తెలుగు సబ్జెక్టులో ఏమైనా ప్రచురణ, తర్జుమా, కాన్సెప్ట్‌కు సంబంధించి దోషాలుంటే నిర్ణీత ప్రొఫార్మాలో సూచనలు చేయాలని డీఈఓ అబ్దుల్‌హై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పుల సవరణకు తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ వారు ప్రతీ జిల్లాకు కొన్ని సబ్జెక్టులు కేటాయించారని, హనుమకొండకు 3, 8వ తరగతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులను పరిశీలించాలని సూచించారు. సూచనలు, సవరణలుంటే ఆ ప్రొఫార్మాలో ఈనెల 20వ తేదీలోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: సీపీ



వరంగల్ క్రైం : కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్ వంటి విష సంస్కృతికి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్‌ను నిర్మించుకోవడంలో కళాశాల క్యాంపస్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కళాశాలలోని తోటి విద్యార్థులతో స్నేహపూరిత వాతావరణం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ర్యాగింగ్ అనేది అత్యంత అమానుష చర్యని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్ష్యం కాదని వివరించారు. ర్యాగింగ్ కేసుల్లో ఇరుక్కుంటే విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను కోల్పోతారని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు తరచూ కొత్తగా చేరిన విద్యార్థులను సంప్రదిస్తూ వారిలో ర్యాగింగ్ మహమ్మారిని వ్యతిరేకించేలా ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించాలని సూచించారు. ఎవరైనా కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్ గురవుతున్నట్లు అనిపించినా విద్యార్థులు మౌనంగా ఉండకుండా తక్షణమే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ కమర్షియల్ ప్రాక్టీస్ (సీసీపీ) మూడేళ్ల కోర్సులో ప్రవేశాల స్పాట్ అడ్మిషన్ల కోసం గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 12న స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సీపీని కలిసిన పోలీస్ అధికారులు



వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన బదిలీల్లో ధర్మసాగర్, స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్లకు నూతన ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్, వేణుతోపాటు ఐటీ కోర్ విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసులపై ప్రజల్లో గౌరవం పెంచేలా నీతి నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. నిత్యం వారికి అందుబాటులో ఉండాలని కోరారు.

నిబంధనలకు వధ!

జంతు వధశాలల్లో నిబంధనలు హుష్ కాకి

- నివాసాల నడుమనే మేకలు, గొర్రెల వధ
- చోద్యం చూస్తున్న గ్రేటర్ పాలక, అధికార వర్గాలు





వరంగల్ లక్ష్మీపురం జంతు వధశాలలో మేకలు, గొర్రెల్ని వధిస్తున్న వ్యాపారులు

వరంగల్ అర్బన్: మహా నగర ప్రజానీకానికి స్వచ్ఛమైన మాంసాహారం కరువైంది. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన గ్రేటర్ యంత్రాంగం ఆ బాధ్యత నుంచి తప్పుకున్నట్లుగా వ్యవహరిస్తోంది. ముద్ర పడిన మాంసం సురక్షితమని ప్రజలు నమ్ముతున్నారు. కానీ.. ప్రజల నమ్మకం వమ్ము అవుతోంది. నిర్వాహకులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు.

వధశాలలో నిబంధనలకు తూట్లు

గ్రేటర్ పరిధి గిర్మాజీపేట లక్ష్మీపురం, పద్మాక్షి గుట్ట లక్ష్మీపురం, కాజీపేటలో బల్దియాకు చెందిన వధశాలలు ఉన్నాయి. ఇక్కడ గొర్రెలు, మేకలు వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా ఉన్నాయా? అని పశు వైద్యాధికారి నిర్ధారణ చేయాలి. వైద్యాధికారి ముద్ర వేసిన తర్వాత మాంసం విక్రయానికి అనుమతివ్వాలి. కానీ మూడు సెంటర్లలో వైద్యులు లేరు. నిబంధనలు ఎక్కడా అమలవడం లేదు. వెటర్నరీ డాక్టర్‌కు బదులుగా ఏ అర్హత లేని బల్దియా జవాన్ గొర్రెలకు, మేకలను వధించే ముందు ఎలాంటి పరీక్షలు లేకుండా ముద్ర వేయడం గమనార్హం. అధికశాతం మాంసం విక్రయదారులు తమ షాపులు గొర్రెలు, మేకలను ఉంచే ప్రాంతంలోనే వధిస్తున్నారు. నివాసిత ప్రాంతాల్లో వధించడంతో పరిసరాలు కంపుగా మారడమే కాకుండా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ప్రజారోగ్యం పరిహాసం..

ఏడాదిన్నరలోపు, జబ్బుతో ఉన్న వాటిని, చూడి మేకలు, గొర్రెలను వధించకూడదన్న నిబంధనలు అమలు కావడం లేదు. వైద్య పరీక్షలకు అసలు దిక్కేలేదు. నివాసాల నడుమ వాటిని వధిస్తున్నారు. మరోవైపు బల్దియా ప్రజారోగ్యం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు మామూళ్ల మత్తులో కూరుకుపోయారు. మాంసం విక్రయాలు బహిరంగంగానే కొనసాగుతున్నాయి. కొన్ని దుకాణాలు అపరిశుభ్ర వాతావరణంలో నడుస్తున్నాయి. మటన్ షాపులు కనీస జాగ్రత్తలు పాటించట్లేదు. బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం మాంసం దుకాణాల్లో నెలకొన్న అపరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. మాంసంపై ఈగలు, దోమలు వాలుతూ.. మటన్ దాకాణాల్లో మాంసాన్ని వేలాడదీస్తున్నారు. కనీసం దానిపై ఈగలు, దోమలు వాలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోడం లేదు. తద్వారా ఆరోగ్యం పాడైపోతోంది.

పాలక వర్గం దృష్టి సారిస్తేనే..

నిబంధనల ప్రకారం 10కి పైగా జంతు వధశాలలు ఉండాలి. కానీ.. కేవలం మూడు మాత్రమే ఉన్నాయి. ప్రతీ జంతు వధశాలలో వెటర్నరీ డాక్టర్ ఉండాలి. ఒక్కరు కూడా లేరు. దీంతో గొర్రెలు, మేకల ఆరోగ్యంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

నిబంధనలు ఇవీ..

- బల్దియాలో వెటర్నరీ డాక్టర్ ఒకే ఒక్కరున్నారు. ఆయన కేవలం కోతులు, కుక్కల బెడద నివారణకే పరిమితయ్యారు. ఫలితంగా వధశాలల్లో పరీక్షలు జరగడం లేదు.
- 1955 హైదరాబాద్ మున్సిపల్ చట్టం సెక్షన్ 458 ప్రకారం గొర్రెలు, మేకల మాంసం, చికెన్ విక్రయించే వారిని నియంత్రించేందుకు నిబంధనలున్నాయి. వీటిని నగర పాలక సంస్థ తప్పనిసరిగా అమలు చేయాలి.
- ఇళ్ల వద్ద మేకలు, గొర్రెలు ఇతర జంతువులను వధించరాదు.
- అనారోగ్యకరమైన వాటిని వధించకూడదు.
- నగరంలో మేకలు, గొర్రెలను జంతువధశాలలోనే వధించాలి.
- నాసిరకమైన మాంసం విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించి, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయాలి.
- మాంసం విక్రయించే వ్యాపారులు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- జంతు వధశాలలో నిరంతరం పశువైద్యాధికారి తనిఖీ చేయాలి. మాంసం విక్రయించే కేంద్రాలను తనిఖీ చేయాలి.
- ఆరోగ్యకరమైనవిగా వైద్యుడు నిర్ధారించిన తర్వాతే కార్పొరేషన్ ముద్ర వేయాలి. ముద్ర లేకుండా మాంసం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి.
- అనారోగ్యకరమైన గొర్రెలు, మేకల మాంసాన్ని స్వాధీనం చేసుకొని భూమిలో పాతిపెట్టాలి.
- జంతువధశాల నుంచి వెలువడే వాటిని ఈటీపీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేయాలి.
- మాంసం విక్రయించేవారు. ఈగలు, దోమలు వాలకుండా దోమ తెరలు వాడాలి.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, పాల్గొన్న అధికారులు



పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు పూర్తయిన పాఠశాలలను గుర్తించి ఎంబీలో నమోదు చేయాలన్నారు. కమిటీ, హెచ్ఎంల ద్వారా పనులు పూర్తయినట్లు సర్టిఫై చేయించాలని సూచించారు. ఏమైనా పనులు మిగిలి ఉంటే త్వరగా అంచనాలు తయారు చేసి సమర్పించాలన్నారు. మంజూరైన ఎలక్ట్రిసిటీ, మైనర్ రిపేర్లు, తాగునీరు, టాయిలెట్లు తదితర పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నూతనీకరణలో భాగంగా చేస్తున్న పెయింటింగ్స్, టాయిలెట్స్, తాగునీరు, ఎలక్ట్రిసిటీ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్డీఏ పీడీ నాగపద్మజ, డీఈఓ అబ్దుల్ హై, సీపీఓ సత్యనారాయణరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులున్నారు.

గడువులోగా బ్రిడ్జి పనులు పూర్తి చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



నయీంనగర్ నాలా అభివృద్ధి పనుల్ని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్/నయీంనగర్: గడువులోగా.. నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. హనుమకొండ నయీమ్‌నగర్‌లో కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను కమిషనర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేగంగా పూర్తి చేసేందుకు అధికారులకు సూచనలిచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న బ్రిడ్జి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నందున ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని హెచ్చరించారు. ఇరిగేషన్ అధికారులు సైడ్ వాల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నాలాకు చెందిన అన్ని ఔట్ లైన్ పైపులను బ్రిడ్జి కింది వైపున అనుసంధానం చేయాలన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన వెంటనే డివైడర్లను ఏర్పాటు చేసి సుందరీకరించాలని కమిషనర్ ఆదేశించారు. నాలాకు చెందిన ఆక్రమణల సమాచారాన్ని సిటీ ప్లానర్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో బల్దియా ఇన్‌చార్జ్ ఎస్ఈ రాజయ్య, సిటీ ప్లానర్ శైలజ, ఎంహెచ్ ఈఈ మనోహర్, డీఈ శ్యామ్ మోహన్‌రెడ్డి, ఏఈలు దొడ్డి పాటి హరికుమార్, విజయలక్ష్మి తదితరులున్నారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో మోసం

- భూమి మరోసారి విక్రయం
- పట్టాదారుడితోపాటు మరో ఇద్దరిపై కేసు



వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేశ్

హసన్‌పర్తి: అమ్మిన భూమిని మళ్లీ విక్రయించిన పట్టాదారుడితో పాటు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి ఈభూమిని కాజేశారు. ఇందులో పట్టాదారుడితో పాటు ఖరీదుదారుడు అరెస్ట్ కాగా.. మరో కొనుగోలుదారుడు పరారీలో ఉన్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లాపురానికి చెందిన మండల ఆదిరెడ్డి ప్రస్తుతం హనుమకొండలో ఉంటున్నాడు. ఇదే గ్రామ శివారులోని సర్వే నంబర్ 75/సీ/1లో అతడికి 4.27 ఎకరాల భూమి ఉంది. 2008లో పట్టాదారుడు ఆదిరెడ్డి తన భూమిని అమ్మకానికి పెట్టగా.. శ్రీనివాస్ అనే వ్యక్తి కొన్నాడు. ఆతర్వాత ఈ భూమి కాసం రమేశ్, విజయ్‌కుమార్ ఖరీదు చేశారు. కాగా, విజయ్‌కుమార్, కాసం రమేశ్ ఈ భూమిని 2009లో కొని 88 ప్లాట్లుగా విభజించి విక్రయించారు. ఇందులో ఎర్రబోయిన లక్ష్మయ్య 12 గుంటలు (6 ప్లాట్లు) కొన్నాడు.

ఫోర్జరీ డాక్యుమెంట్ సృష్టించి...

ఇదిలా ఉండగా.. పట్టాదారుడు 12 గుంటల భూమి తనకు ఉన్నట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించారు. 2010లోనే ఆర్డీఓ కార్యాలయం నుంచి 12 గుంటల సాగు భూమికి వ్యవసాయేతర భూమిగా పత్రం పొందాడు. ఆతర్వాత ఈభూమిని 2023లో కాపువాడ, వడ్లెపల్లికి చెందిన కాసర్ల దేవేందర్‌రెడ్డి, మడికొండకు చెందిన చిలువేరు సురేందర్‌లు విక్రయించారు. ఫోర్జరీ డాక్యుమెంట్ల సృష్టించడంలో దేవేందర్, సురేందర్ కీలకంగా వ్యవహరించారు. కాగా.. 15 రోజుల క్రితం దేవేందర్‌రెడ్డి, సురేందర్ భూమి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. దీంతో బాధితుడు లక్ష్మయ్య పోలీసులను ఆశ్రయించాడు. ఈవిషయమై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపారు. దీంతో పట్టాదారుడు మండల ఆదిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, సురేందర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాదారుడు ఆదిరెడ్డితో పాటు ఖరీదు చేసిన దేవేందర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. మరో కొనుగోలుదారుడు సురేందర్ పరారీలో ఉన్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు.

ఇక బినామీ సభ్యులకు చెక్

ఆన్‌లైన్‌లో స్వశక్తి సంఘాల వివరాలు

- 'లోకోస్' యాప్‌లో సేవలు
- కొనసాగుతున్న ఆధార్ అనుసంధాన ప్రక్రియ



కాజీపేట: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక స్వాలంబన వైపుగా అడుగులు వేస్తున్నారు. ఇచ్చిన రుణంతో వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబానికి భరోసా ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో సభ్యులకు తెలియకుండానే నిధులు పక్కదారి పట్టించారు. బినామీ పేర్లతో బ్యాంకు రుణాలు పొందుతూ వాయిదాలు సరిగ్గా చెల్లించకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ తరుణంలో స్వశక్తి సంఘాల లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (నేషనల్ రూరల్ లైవ్లీ వుడ్ మిషన్) ఆధ్వర్యంలో ప్రతీ సభ్యురాలి బ్యాంకు ఖాతాను ఆధార్‌కు అనుసంధించనుంది. పొదుపు, రుణాల లావాదేవీల వివరాల్లో పారదర్శకత పాటించేందుకు లోకోస్ యాప్‌నకు ఈ వివరాలు దోహదపడనున్నాయి.

యాప్‌లో సమాచారం...

హనుమకొండ జిల్లావ్యాప్తంగా 9,272 స్వశక్తి సంఘాలు, 1,52,149 మంది సభ్యులున్నారు. వీరందరి ఖాతాలకు ఆధార్ నంబర్ల అనుసంధాన ప్రక్రియ నేటికీ కొనసాగుతోంది. సంఘాల లెక్కలు, పొందిన రుణాలు, చెల్లించే వడ్డీ, ఇతర కార్యకలాపాల వివరాల్లో పారదర్శకత కోసం లోకోస్ యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ నూతన విధానంతో జాతీయ స్థాయిలో పొదుపు సంఘాల వివరాలు ఒకేచోట లభించనున్నాయి. ఆర్థిక లావాదేవీలు, పొదుపు, ఇతర వివరాలు తెలుసుకునేందుకు ఎంతో సులువుగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అనుసంధాన ప్రక్రియ కొనసాగుతోంది.

రెండుచోట్ల ఉంటే గుర్తింపు...

లోకోస్ యాప్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా బోగస్ సంఘాలకు చెక్‌పడనుంది. ఎవరైతే రుణం తీసుకొని సక్రమంగా చెల్లించి ఆర్థికంగా బలోపేతమవుతున్నారో వారి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. కొన్నిచోట్ల ఒకే మహిళ రెండు సంఘాల్లో సభ్యురాలిగా కొనసాగుతూ రెండు చోట్లా రుణం పొందుతున్నారు. ఈ కొత్త విధానంతో ఇకపై రెండు ప్రాంతాల్లో సభ్యులుగా ఉన్న వారిని గుర్తించే వీలుంటుంది. అలాంటి వారు ఉంటే తొలగిస్తారు.

నగదు రహిత లావాదేవీలు..

ప్రతీ మహిళా నగదురహిత లావాదేవీలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే రోజుల్లో కాగిత రహిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆన్‌లైన్ సేవలు ఎలా పొందాలి, ఇతర విషయాలపై మహిళా సంఘాలకు వివరించనున్నారు. 'ప్రస్తుతం బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయి' అని అధికారులు చెబుతున్నారు.

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని చింతలమోరి గొత్తికోయగూడెంలో మొక్కజొన్నలో కలుపు తీస్తున్న ఆదివాసీ దంపతులు



ఆదివాసీ.. అడవి నివాసి

అడవే ఆధారం.. బాహ్యప్రపంచంతో పెద్దగా సంబంధాలు లేని గూడేలు.. మట్టి ఇళ్లు, గూన పెంకుల కప్పులు.. సంప్రదాయ పత్తి, మొక్కజొన్న పోడు వ్యవసాయం.. ఇవి వీరి ఆస్తి. ఒక వైపు ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. వాటిని పట్టించుకోరు. పాత పద్ధతులను అవలంబిస్తారు. పచ్చటి అడవిని నమ్ముకుని జీవనం సాగించడం వీరి ప్రత్యేకత. నేడు (శుక్రవారం) అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా.. కథనం 8లో..

- ఏటూరునాగారం

జిల్లా మొబిలైజింగ్ కో-ఆర్డినేటర్‌కు రీప్యాట్రేషన్

విద్యారణ్యపురి: సమగ్రశిక్షలో జిల్లా మొబిలైజింగ్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా కో–ఆర్డినేటర్‌గా ఫారిన్ డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించిన పీజీ హెచ్ఎం బి.రాధను రీప్యాట్రేషన్ చేశారు. తనను ఆ బాధ్యతల నుంచి రీప్యాట్రేషన్ (మాతృ సంస్థ) చేయాలని, పీజీహెచ్‌ఎంగానే పోస్టింగ్ ఇవ్వాలని నెల క్రితం ఆమె పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు లేఖ పంపారు. ఉన్నతాధికారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి బి.రాధను రీప్యాట్రేషన్ చేస్తూ.. గురువారం ఉత్తర్వులిచ్చారు. ఈమేరకు రాధకు హనుమకొండ జిల్లాలోని ఐనవోలు మండలం కొండపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో పీజీహెచ్‌ఎంగా పోస్టింగ్ ఇచ్చారు.

పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న వరంగల్, హనుమకొండ న్యాయవాదులు

వరంగల్ లీగల్: జనగామ న్యాయవాద దంపతులపై దాడి చేసి, దుర్భాషలాడిన సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్, రమేశ్‌బాబు మాట్లాడుతూ.. న్యాయవాదులపై కొనసాగుతున్న పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఇరు బార్ అసోసియేషన్ల ప్రధాన కార్యదర్శులు ముదసర్ అహ్మద్, ఎల్.రమేశ్, బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్, మాజీ బార్ కౌన్సిల్ సభ్యుడు సహోదర్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

వీసీ నియామకానికి ఈసీ నామిని

ప్రతిపాదించిన కేయూ పాలకమండలి

- పీహెచ్‌డీ ఖాళీల్లో అడ్మిషన్ల ప్రక్రియకు ఓకే
- మెరిట్ లిస్ట్ ప్రకారమే.. అడ్మిషన్లు
- హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ (వీసీ)నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీకి సభ్యుడిగా కేయూ పాలక మండలి తరఫున ఈసీ నామినిని ఖరారు చేసి ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం హైదరాబాద్ సెక్రటేరియట్‌లోని మీటింగ్ హాల్‌లో కేయూ పాలక మండలి సమావేశం నిర్వహించారు.

'పీహెచ్‌డీ' ఖాళీల్లో మళ్లీ అడ్మిషన్లకు ఒకే..

యూనివర్సిటీలోని ఆర్ట్స్, సోషల్‌సైన్స్, సైన్స్, ఫార్మసీ, కామర్స్, ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్, లా విభాగాల్లోని పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించి మిగిలిన సీట్లలో అప్పటి నోటిఫికేషన్ తర్వాత నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఏర్పడిన ఖాళీల్లోనూ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాలని పాలకమండలి సమావేశంలో చర్చించి ఆమోదించినట్లు సమాచారం. పీహెచ్‌డీ 2021–22 విద్యాసంవత్సరంలో కేటగిరీ–2లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం కొంత కాలం క్రితం అడ్మిషన్లు జరగ్గా, అందులో మిగిలిన సీట్లతోపాటు కేయూలో ఇప్పటికే జరిగిన మొదటి కేటగిరీ–1లోని అడ్మిషన్ల ప్రక్రియ అనంతరం మిగిలిన సీట్లు కేటగిరీ –2లోకి మార్చారు. ఆ విధంగా 72 సీట్ల వరకు ఉంటాయని భావిస్తున్నారు. అదే విధంగా ఈ ఏడాది మార్చి 31వ తేదీలోపు వివిధ విభాగాల్లో ఏర్పడిన వేకెన్సీలు ఎన్ని అనేది కూడా లెక్కలు తీశారు. విభాగాల వారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీ అధికారులు ఇప్పుడు పాలకమండలిలో చర్చించి ఒకే చెప్పడంతో కొంతకాలంగా నిరీక్షిస్తున్న అభ్యర్థులకు ఊరట కలిగినట్లయింది. ఇప్పటికే పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన మెరిట్ జాబితా ఉంది. అందులోనుంచే అభ్యర్థులకు ఖాళీల ప్రకారం అడ్మిషన్లు కల్పించే అవకాశం ఏర్పడింది.

పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా..

కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా నియమించాలనే విషయమై పాలకమండలిలో చర్చించారు. ఫైనాన్స్‌కు సంబంధించిన అంశం అయినందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పాలకమండలి నిర్ణయించినట్లు సమాచారం. క్యాంపస్‌లోని మహిళా నూతన హాస్టల్‌లో డైనింగ్‌హాల్ నిర్మాణానికి పాలకమండలి ఓకే చెప్పినట్లు సమాచారం. పరిపాలనాపదవుల నియామకాలకు ర్యాటిఫికేషన్‌ను ఆమోదించింది. సెక్యూరిటీ సర్వీసెస్‌ను ఇటీవల నూతనంగా నియమించారు. వీరి నియమాకానికి కూడా పాలకమండలి ర్యాటిఫికేషన్ చేసింది. ఇదిలా ఉండగా బోధనేతర ఉద్యోగులకు సంబంధించి రెండు అంశాలు ఎజెండాలో పెట్టినప్పటికీ అవి డిఫర్ అయినట్లు సమాచారం. సమావేశంలో కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. తొలుత వర్సిటీకి సంబంధించి ఫైనాన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య పాల్గొన్నారు.

మ్యూటేషన్.. పరేషాన్

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టు తిరుగుతున్న భూమి కొనుగోలుదారులు
- సబ్ రిజిస్ట్రార్లకు థంబ్ కోడ్ రాకపోవడంతో జరగని రిజిస్ట్రేషన్లు



కాజీపేట అర్బన్ : 'భూమిని కొనుగోలు చేశాం.. రిజిస్ట్రేషన్ చేసుకున్నాం.. అయినా భూమి హక్కు మా పేరున మ్యూటేషన్(బదిలీ)కాలేదు.. ఎప్పుడు అవుతుంది సార్' అంటూ రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టు భూమి కొనుగోలుదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా మ్యూటేషన్‌తో పరేషాన్ అవుతున్నామని వారు వాపోతున్నారు. జూలై 31వ తేదీన సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్ బదిలీ అయ్యారు. ఆగస్టు 1వ తేదీన బదిలీపై విధ్చేసిన సబ్ రిజిస్ట్రార్‌లకు థంబ్ కోడ్ రాకపోవడంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు.

భూమిపై హక్కు లేక..దిక్కుతోచని స్థితిలో

భూమి కొనుగోలు సమయంలో 7.5 రిజిస్ట్రేషన్, స్టాంప్స్ ఫీజును చెల్లించడంతో పాటు భూబదలాయింపు (మ్యూటేషన్)కు ప్రత్యేకంగా రూ.3 వేలు వసూలు చేస్తారు. గతంలో మున్సిపల్ కార్యాలయంలో బదలాయింపు జరుపుతుండగా సమయ ఆదా కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకే పనిని అప్పగించారు. ఓ వైపు రిజిస్ట్రేషన్ అయ్యిందనే ఆనందం.. మరో వైపు భూబదలాయింపు జరగలేదనే ఆవేదనతో భూమి కొనుగోలు దారులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. భూమిని కొనుగోలు చేసి ఇంటి నంబర్‌కు వెళ్దామన్న కుదరదు. దీంతో చేసేదిలేక తప్పని పరిస్థితిలో రోజూ మ్యూటేషన్ కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. బదిలీలకు ముందు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో సుమారు 2వేలకు పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా సుమారు 1500 మ్యూటేషన్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వెంటనే సబ్ రిజిస్ట్రార్లు చొరవ తీసుకుని మ్యూటేషన్ పరేషాన్‌ను తొలగించాలని భూమి కొనుగోలుదారులు వేడుకుంటున్నారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రాంగణ నియామకాలు



కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని జిత్రా ఏఐ సంస్థ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు ఆ కళాశాలల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విశాల మహేందర్ తెలిపారు. 2024–2025 విద్యాసంవత్సరంలో చివరి సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచీల ఇంజనీరింగ్ విద్యార్థులు 250 మంది ఈ ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్నారు. వీరిలో 15 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని మహేందర్ తెలిపారు. వీరికి వార్షికవేతనం రూ 5.50 లక్షల నుంచి రూ .7లక్షల వరకు ఉంటుందన్నారు. ఎంపికైన వారికి రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు బొల్లం కిరణ్‌కుమార్, రమణబాబు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అడవి బిడ్డ అరణ్య రోదన..

నేటికీ మారని ఆదివాసీల దుర్భర పరిస్థితులు

- రవాణా మార్గం లేని గూడేలు ఎన్నో
- విద్య, వైద్యం కోసం నానాటికీ పోరాటాలే
- హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు పాట్లు
- ఇప్పటికీ పోడు వ్యవసాయమే దిక్కు
- 1986లో ఐటీడీఏ ఏర్పాటైనా అభివృద్ధి శూన్యం..
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



మీరు చూస్తున్న ఊరు పేరు చింతలమోరి. ఇది పూర్తిగా ఆదివాసీ గొత్తికోయగూడెం. ఇక్కడ బడి లేదు.. ప్రభుత్వ దవాఖానలేదు. సరైన రోడ్డు లేక అడవిలో నుంచి నడుచుకుంటూ ఆ గూడేనికి చేరుకోవాలి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని గూడెం చింతలమోరి. గొత్తికోయలు ఛత్తీస్‌గఢ్ నుంచి 20 ఏళ్ల క్రితం వలస వచ్చి బతుకుజీవుడా అంటూ ఇక్కడే పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ కావడంతో అక్కడ శాశ్వత నిర్మాణాలు, సౌకర్యాలు చేపట్టలేకపోతున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఫలితండా అడవి బిడ్డలు మట్టి ఇళ్లు, గూనపెంకుల కప్పుతో కాలం వెళ్లదీస్తున్నారు. ఎలాంటి విద్యుత్ సరఫరా ఉండదు. కేవలం నెగళ్లు, కాగడాలు, సోలార్ లైట్లతోనే వారు కాలం వెళ్లదీస్తున్నారు. కాగా, ప్రస్తుతం అక్కడ పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఓ గుడిసెలో ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేసి అందులో టీచర్‌ను నియమించి విద్యాబోధన చేస్తున్నారు. పత్తి, మొక్క జొన్న సాగు చేస్తూ వచ్చిన పంటలో కొంత అమ్ముకుని తీనడానికి కొంత నిల్వ చేసుకుంటారు. వారికి ఎరువులు, పురుగుల మందుల వినియోగం తెలియదు. కేవలం మేక, పశు ఎరువు వినియోగిస్తూ పంటలు పండిస్తున్నారు. కనీసం ఎడ్లు కూడా లేకపోవడంతో భార్యాభర్తలు కలిసి కలుపుతీసేందుకు నాన తంటాలు పడుతున్నారు. ఇలాంటి జీవన చిత్రాలు ఏజెన్సీలో అనేకం ఉన్నాయి అంటే అతియోశక్తికాదు.



వెదురుతో తయారు చేసిన ఊయలలో చిన్నారిని ఊపుతున్న తల్లి

ఏటూరునాగారం : ఆదివాసీ.. భారతదేశ ప్రాచీన తెగ. ఈ అడవి బిడ్డల ఆచారాలు.. వ్యవహారాలు, కట్టు.. బొట్టు, వేషధారణ.. వస్త్రధారణ పూర్తిగా ఇతరులకు భిన్నం. మైదానం ప్రాంతంలో సంబంధం లేకుండా పూర్తిగా అడవితల్లితో పెనవేసుకున్న బంధం వీరిది. అడవిలో లభించే ఆకులు, దుంపలే పరమాన్నం. పోడు వ్యయసాయమే జీవనాధారం. అయితే ఎన్ని ప్రభుత్వాలు.. ఎందరు పాలకులు మారినా వీరి దుర్భర పరిస్థితులు మారడం లేదు. ఎన్ని పథకాలు పెట్టినా.. ఎంత బడ్జెట్ కేటాయించినా చివరి వరకు చేరకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. ఈ క్రమంలో నేడు (శుక్రవారం) అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు.. ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, సమస్యలపై 'సాక్షి' కథనం.

గిరిజనాభివృద్ధి కోసమే ఏర్పాటు

ఆదివాసీల అభివృద్ధే ధ్యేయంగా ఏటూరునాగారంలో 1986లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు అధికారి(పీఓ) పాలనలో 29 శాఖలకు అధికారులు, సిబ్బంది పనిచేస్తారు. వీరంతా ఆదివాసీల అభివృద్ధి కోసమే పనిచేయాల్సి ఉంది. అయితే కార్యాలయం ఉన్నప్పటికీ ఆదివాసీల బతుకుల్లో వెలుగులు నింపలేకపోతోంది. ఈనాటికి కూడా గూడేలకు రవాణాసౌకర్యాలు లేవంటే పాలకులకు పని తీరు అర్థం చేసుకోవచ్చు. ఊరట్టం– కొండాయి మధ్య రోడ్డు బురదమయంగా మారడంతో గ్రామస్తులు దినదినగండంగా బతుకుతున్నారు. కన్నాయిగూడెం మండలం ఐలాపురానికి ఇప్పటి వరకూ శాశ్వత రోడ్డు లేదు. కేవలం మట్టి రోడ్డుతో వాగులు, వంకలు దాటుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా అనేక గ్రామాలు ఉన్నాయి.

ఐటీడీఏ పరిధిలో..

ఏజెన్సీ మండలాలు	13
గ్రామాలు	177
గ్రామ పంచాయతీలు	83
మొత్తం జనాభా	1.86.607
ఇళ్లు	48.052
పురుషులు, స్త్రీలు	82.088

చట్టాలు, సంప్రదాయాలు

5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అడవి హక్కుల గుర్తింపు చట్టం (2006) ఉంది. అయినా వనరులు దోపిడీకి గురవుతున్నాయని నానాటికీ ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం అమల్లోకి వచ్చిన సమయంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ కేవలం 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 6,546 మందికి మందికి పోడు పట్టాలు అందజేశారు.

ప్రతీ పండుగ ప్రత్యేకత

కోయల్లో పుట్టుక, పురుడు నేల మీదే జరుగుతుంది. మంత్రసానిలు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు ముడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్ల మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్టెలో వేసి బారసాల చేయడం ఆచారం. పిల్లల పేర్లు ఇలవేల్పు సమ్మక్క పేరుమీదే ఎక్కువ ఉంటాయి. నాగదేవత మీద, తాజాగా రాముడు, వెంకటేశ్వర్లు వంటి హిందూ దేవుళ్ల మీద కూడా నామకరణం చేస్తున్నారు. కోయ పండుగలు విభిన్నంగా.. విశిష్టంగా ఉంటాయి. ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగ లేదా విత్తు పండుగ , సూరాల పండు, సుంకుల పండుగా చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగంటి పండుగ, –కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్ల కోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



పాఠం చెబుతున్న టీచర్ సాయి స్నేహ

జెనీవాలో గుర్తింపు

ప్రపంచంలోని అన్ని దేశాలు ఆదివాసీ సంరక్షణకు కృషి చేయాలనే ఉద్దేశంతో ఆదివాసీ హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల రక్షణకు ఐక్య రాజ్యసమితి చర్యలు తీసుకుంది. 1982 ఆగస్టు 9న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల ప్రతినిధులతో వర్కింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించి ఆమోదించింది. అప్పటి నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అడవుల్లో దొరికినవి అమ్ముతాం



అడవుల్లో దొరికేవి మేము తెచ్చుకొని అమ్ముకుంటాం. వచ్చిన డబ్బుతో కిరాణ సామాను, బట్టలు కొనుక్కుంటాం. ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సాయం అందడం లేదు. ఆదుకుని ఉపాధి కల్పించాలి. - రవ్వ ఐతే, చింతలమోరి

రోడ్డు సౌకర్యం కల్పించాలి



చింతలమోరికి రోడ్డు లేదు. రోడ్డు సౌకర్యం కల్పించాలి. మేము ఎటైనా పోతే నడుచుకుంటూ పోవాలి. రోడ్డు లేక ఎలాంటి వాహనం వచ్చే పరిస్థితి లేదు. పిల్లలను బడికి పంపడానికి కూడా ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం చూడాలి. - కోస జీమా, చింతలమోరి

ఫలాలపై దృష్టి

అటవీ ఉత్పత్తుల ఫలసాయంపైనే ఆదివాసీలు దృష్టిసారిస్తారు. అడవిలో లభించే చీపుర్లు, ఉసిరికాయలు, పుట్టగొడుగులు, తునికికాయలు, పాలపండ్లు, పూసుకుకాయలు, బోడకాకర, తేనె, బంక, ఇప్ప పలుకులు, ఇప్ప పూలు విక్రయిస్తారు. వచ్చిన సొమ్ముతో సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుంటారు.



పుట్టగొడుగులు విక్రయిస్తున్న గిరిజన మహిళ





పత్తిచేనులో కలుపుతీస్తున్న బాలిక, గూడేనికి కొత్త వ్యక్తి వచ్చాడని భయంగా చూస్తున్న మహిళ

హైకోర్టు ఏజీపీగా రూహీ నబీల

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



రూహీ నబీల

వరంగల్ లీగల్ : హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన రూహీ నబీలను తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూహీ ఇంటర్మీడియట్ వరకు హనుమకొండలో, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటీలో చదివారు. తన తండ్రి మహమూద్ వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా, ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. తండ్రి బాటలో నడిచి 2016లో తెలంగాణ బార్ కౌన్సిల్‌లో తన పేరు నమోదు చేసుకుని న్యాయవాదిగా మొదట వరంగల్ కోర్టులో పనిచేశారు. ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం కోసం తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ఈ సందర్భంగా రూహీ నబీల మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను ఎలాంటి పక్షపాతం, తారతమ్యం లేకుండా నిర్వర్తిస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన న్యాయ అధికారులు, ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రూహీ నియామకంపై కేసముద్రం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూరపనేని నాగేశ్వరరావు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, వరంగల్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్, బార్ అసోసియేషన్ నాయకులు స్వప్న, రమాదేవి, న్యాయవాదులు, తదితరులు అభినందనలు తెలిపారు.

సీఎస్సీ హెల్త్‌కేర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్ : సీఎస్సీ హెల్త్ కేర్ సంస్థలో ఫ్లేబోటమిస్ట్ ఉద్యోగాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఎస్సీ హెల్త్‌కేర్ సీనియర్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ మామిడాల కావ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఎల్‌టీ / డీఎంఎల్‌టీ / బీఎస్సీ ఎంఎల్‌టీ/ ఏఎన్ఎం/ జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలు తీసుకుని ఈనెల 10,11,12 తేదీల్లో నగరంలోని కాజీపేట ఫాతిమానగర్‌లోని పీఎఫ్ ఆఫీస్ రోడ్డులో గల సీఎస్సీ హెల్త్‌కేర్ బిల్డింగ్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63049 87190, 83281 98025 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

నెక్కొండలో ఇంటర్‌సిటీ, జమ్మికుంటలో యశ్వంత్‌పూర్‌కు హాల్టింగ్

కాజీపేట రూరల్: కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అప్ అండ్ డౌన్ రూట్‌లో నెక్కొండ, జమ్మికుంట రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మకంగా హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు. సికింద్రాబాద్–గుంటూరు (12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు–సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లను ఆగస్టు 8వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 8వ తేదీ నుంచి గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ (12591) యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 12వ తేదీ నుంచి యశ్వంత్‌పూర్–గోరఖ్‌పూర్ (12592) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు ఆరు నెలల పాటు నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సుంకిశాలపై సమగ్ర విచారణకు ఆదేశించాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి: సుంకిశాలపై సమగ్ర విచారణకు ఆదేశించామని, రిపోర్టు తెప్పించుకుని గత ప్రభుత్వ హయాంలో ఎవరైతే బాధ్యులు ఉన్నారో వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంకిశాల గోడ పని జరిగింది బీఆర్ఎస్ హయాంలోనేనని తెలిపారు. కూలిన ఘటనలో పూర్తిగా దోషి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆరోపించారు. దీనిపై విచారణకు సిద్ధమేనా..? అని సవాల్ విసిరారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు మసిపూసి బట్టకాల్చి మీదపడేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సుంకిశాలపై ప్రాథమిక రిపోర్ట్ రాగానే ప్రజలముందు ఉంచుతామన్నారు. కాళేశ్వరానికి సంబంధించి లోపభూయిష్ట నిర్ణయాలతో ప్రజలకు నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటన వ్యక్తిగతం కాదని, అధికారిక పర్యటన అని తెలిపారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీతోపాటు ఫైనాన్స్ సెక్రటరీ, ఐటీ, పరిశ్రమలకు సంబంధించిన అధికారులతో కలిసి అనేకమంది పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పర్యటనలో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి అనేక అంశాలపై ముందడుగు పడుతుంటే కుటుంబపరమైన అంశాలు ప్రస్తావిస్తూ చులకన చేసే ప్రయత్న చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల సీఎంగా కొనసాగిన కేసీఆర్ కేవలం ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తే బీఆర్ఎస్ నేతలకు కళ్లమంటలాగా కనిపిస్తోందని అన్నారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్రాని బాగుచేయాలని ఆలోచనతో ఉన్న ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని బీఆర్ఎస్ విమర్శిస్తున్న తీరును ప్రజలు గమనించాలని కోరారు. కేటీఆర్ అనేక సందర్భాల్లో విదేశీ పర్యటనలు చేశారని, ఒక్కసారి కూడా నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే మాట కూడా మాట్లాడడం చేతకాని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అని విమర్శించారు.

పురాతన ఆలయాలకు పూర్వవైభవం

- నిరాదరణకు గురైన కాకతీయుల ఆలయాల పునరుద్ధరణకు చర్యలు
- రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్
- 'సాక్షి' కథనానికి స్పందన
- కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆలయాల పరిశీలన



మధ్యకోటలో పురాతన ఆలయాలను పరిశీలిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కలెక్టర్ సత్యశారద

ఖిలా వరంగల్ : కాకతీయుల కాలం నాటి పురాతన దేవాలయాలను పునరుద్ధరించి చారిత్రక కోట పూర్వవైభవానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. 'కళాసంపద.. కనుమరుగు' అనే శీర్షికతో 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మధ్యకోటలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంత రావు, వరంగల్ కలెక్టర్ సత్యశారద, జిల్లా అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్ కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులతో కలిసి రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పర్యటించారు. ఈ సందర్భంగా మండలమ్మ గుడి, నేల శంభునిగుడి, ఏకశిలగుట్టపై రాముడి పాదాలు, త్రికుటాలయాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణ సాధ్య సాధ్యాలపై కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ, సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ ఇటీవల మంత్రి కొండా సురేఖ అధికారులతో కలిసి కోటలో పర్యటించి కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. మంత్రి ఆదేశాల ప్రకారం క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించామన్నారు. కేంద్ర పురావస్తుశాఖకు సంబంధించిన 14 ఆలయాలు, రాష్ట్ర పురావస్తుశాఖకు సంబంధించిన ఒక ఆలయాన్ని పరిశీలించామని తెలిపారు. ప్రముఖ చరిత్రకారులు, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి ఆలయాల పునరుద్ధరణ చేపడుతామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏఎస్పై డీఈ చంద్రకాంత్, ఏఈ కృష్ణ చైతన్య, జేసీఏ మడిపెల్లి మల్లేశం, ఏడీ మల్లునాయక్, ఇంటెక్ కోకన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సునీత, 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వరరావు, కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, మాజీ కార్పొరేటర్ దామోదర్‌యాదవ్, టీఎస్‌టీడీసీ ఏఈ విజయ్, ఇన్‌చార్జ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుపై కమిటీ

హన్మకొండ కల్చరల్ : పురావస్తుశాఖ పరిధిలో ఉన్న ఖిలా వరంగల్ కోటలోని దేవాలయాల్లో విగ్రహాల ఏర్పాటుపై కమిటీ ఏర్పాటు చేసి చర్చించాలని శైలజా రామయ్యర్ ఆదేశించారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో పురావస్తు శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా పురావస్తుశాఖ అధికారి మల్లేశం మాట్లాడుతూ పురావస్తుశాఖ నిబంధనల మేరకు కొత్తగా విగ్రహాలను ఏర్పాటు చేయరాదని, దీనిని పరిశీలించాలన్నారు.

భద్రకాళి సన్నిధిలో శైలజారామయ్యర్

వరంగల్ భద్రకాళి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు, వరంగల్ కలెక్టర్ సత్య శారద గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓ శేషుభారతి, అర్చకుడు భద్రకాళి శేషు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పూజలు జరిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో కదంబం, మామిడి, నేరేడు మొక్కలు నాటారు.

పదోన్నతులకు లైన్ క్లియర్..

- సంతోషంలో విద్యుత్ ఉద్యోగులు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలం
- యూనియన్, అసోసియేషన్ నేతలతో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సమావేశం

హన్మకొండ: విద్యుత్ సంస్థల్లో పదోన్నతులకు ప్రభుత్వం నుంచి లైన్ క్లియర్ అయింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలం వ్యక్తం చేయడంతో ఇప్పటి వరకు పదోన్నతులు జరుగుతాయో లేదోననే ఆందోళనలో ఉన్న ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. తెలంగాణ పవర్ జేఏసీతో పాటు, ఆయా ఉద్యోగ యూనియన్లు ముందు పదోన్నతులు చేపట్టి ఆ తర్వాతే బదిలీలు చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపట్టడంతోపాటు అవసరమైతే సమ్మెకు వెళ్తామనే హెచ్చరికలు చేస్తూ యాజమాన్యాలకు నోటీసులు అందజేశాయి. ఈ అంశాన్ని విద్యుత్ సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లు ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం రాత్రి హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల యూనియన్లు, అసోసియేషన్ల నాయకులతో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి సమావేశమయ్యారు. పదోన్నతులు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని, యూనియన్లు, అసోసియేషన్లు సహకరించాలని సూచించారు. కండీషన్స్ పెట్టి పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు.

బీసీ అసోసియేషన్ అభ్యంతరం..

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు పాత పద్ధతిలో రిజర్వేషన్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోరగా బీసీ అసోసియేషన్ నాయకులు అభ్యంతరం తెలిపారు. మెరిట్ కమ్ సీనియారిటీ పద్ధతిలోనే చేపట్టాలని కోరారు. దీంతో సీఎండీ వరుణ్ రెడ్డి మీరంత కలిసి ఒక నిర్ణయానికి వస్తే ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసి సమావేశం ముగించారు.

ఆశ తీరకుండానే రిటైర్మెంట్..

కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో 20 ఏళ్లుగా ఒకే పోస్టులో కొనసాగుతూ ఇవాలో.. రేపో పదోన్నతి రాకపోతుందా అని ఎదురుచూసి చివరకు ఆశ తీరకుండానే కొందరు ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజనీర్లు రావడంతో రాష్ట్రానికి చెందిన ఇంజనీర్లు పదోన్నతులు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడీఈలు సీనియర్లు కావడంతో వారికి పదోన్నతులు కల్పించారు. దీంతో స్థానికత కలిగి ఉండి ఎన్నో ఏళ్లుగా ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న 12 మంది సీనియర్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కొందరికి రివర్షన్ ఇచ్చారు. ఆదిలాబాద్ ఎస్ఈగా పని చేస్తున్న జడ్.ఉత్తమ్ డీఈగా రివర్షన్ పొందారు. డీఈలుగా పని చేస్తున్న ఉపేందర్, ఇ.వాసుదేవ్‌కు ఏడీఈలుగా రివర్షన్ ఇచ్చారు. సీజీఎం హోదాలో సీజీఆర్ఎఫ్‌లో అకౌంట్స్ మెంబర్‌గా పని చేస్తున్న చరణ్‌దాస్‌కు జీఎంగా రివర్షన్ ఇచ్చారు. వచ్చిన వారు సీనియర్లు కావడంతో స్థానికులు సీనియారిటీలో వెనుకబడ్డారు.

సొంత ప్రాంతానికి వెళ్లిన 14 మంది ఉద్యోగులు..

ఎస్సీ, ఎస్టీ ఇంజనీర్లు తిరిగి సొంత ప్రాంతానికి వెళ్లడానికి సుప్రీం కోర్టు అవకాశం కల్పించగా 14 మంది వెళ్లారు. దీంతో వెళ్లిపోయిన వారిలో ఎస్సీ, ఎస్టీలైన ఆరుగురు డివిజన్ ఇంజనీర్లు, ఆరుగురు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్లు, ఒక సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఒక్క సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉన్నారు. ఈ పోస్టులు ఖాళీ కావడంతో మరోసారి స్థానిక ఏడీఈల్లో తమకు పదోన్నతులు లభిస్తాయనే ఆశలు చిగురించాయి. ఈ క్రమంలో మెరిట్ కమ్ సీనియారిటీ, రిజర్వేషన్ కమ్ సీనియారిటీ అంశం సమస్యగా పరిణమించింది. దీంతో పాటు మరో అంశం కోర్టుకు చేరింది. కోర్టులో కేసులు ఉండడంతో యాజమాన్యం పదోన్నతుల ప్రక్రియకు ముందుకు రాలేదు. మరో వైపు బదిలీలకు మార్గదర్శకాలు సిద్ధం చేయడంతో.. బదిలీలు చేస్తే పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోతుందని, ఉద్యోగులు, ఇంజనీర్లకు నష్టం జరుగుతుందని యూనియన్లు, అసోసియేషన్లపై ఒత్తిడి పెరిగింది. ఎలాగైనా పదోన్నతులు కల్పించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని ఉద్యోగుల నుంచి డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో ఉద్యోగుల జేఏసీ, యూనియన్లు నోటీసులు ఇవ్వడంతో పాటు అవసరమైతే కోర్టు తీర్పుకు లోబడి కండిషన్‌తోనైనా పదోన్నతి కల్పించాలని సలహా ఇచ్చాయి. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పదోన్నతులు కల్పించనున్నట్లు తెలుపడంతో మరోసారి ఆశలు చిగురించాయి. పదోన్నతులు కల్పిస్తే ఖాళీలపై స్పష్టత వస్తుందని, తర్వాత బదిలీలు జరిపితే ఖాళీలు భర్తీ చేయడానికి మార్గం సుగమవుతుందని యూనియన్, అసోసియేషన్ నాయకులు తెలిపారు.